వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

- మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి
- పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్



మడకశిరలో మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్. చిత్రంలో సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర/గుడిబండ: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం జరిగే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం మడకశిరలోని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల్లో పర్యటిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయడానికి మండలాల వారీగా జరిగే సమావేశాల్లో పాల్గొంటారన్నారు. తొలుత మంత్రి పర్యటన అగళి నుంచి ఉదయం ప్రారంభం అవుతుందన్నారు. ఆ తర్వాత రొళ్ల, గుడిబండ,అ మరాపురం, మడకశిరలో జరిగే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్దన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బీఎల్ రామకృష్ణ, స్థానిక నాయకులు బేకరీ నాగరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుడిబండలోని నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ఎల్ ఈరలక్కప్ప స్వగృహాన్ని నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్ సందర్శించారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి పట్టణంలో నిర్వహించే మంత్రి పెద్దిరెడ్డి సభకు సంబంధించిన ఏర్పాట్లను వారు పరిశీలించారు.

మంత్రి పర్యటన జయప్రదం చేయండి

రొళ్ల/అగళి/అమరాపురం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం రొళ్ల పట్టణంలో ఉదయం 10.30 గంటలకు పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్ సూచించారు. గురువారం రాష్ట్ర కుంచిటి వక్కలిక కార్పొరేషన్ చైర్మన్ నళిని, పార్టీ శ్రేణులతో కలసి వారు మంత్రి సభా స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ ప్యాలెస్ కల్యాణ మంటపం ఆవరణలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంతకుముందు కొత్త పాళ్యం వెంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, సర్పంచ్ ప్రకాష్, వైస్ ఎంపీపీ నాగరాజు, సీనియర్ నాయకులు విజయరంగేగౌడు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

- అగళిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో గురువారం నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్ సమావేశయ్యారు. శుక్రవారం జరగనున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటను విజయవంతంపై పలు సూచనలు, సలహాలిచ్చారు. మండల కేంద్రంలోని ఆర్ కే కళ్యాణ మండపంలో సమావేశం ఉంటుందన్నారు. మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్పతో కలసి మంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు నాసిర్,సింగల్ విండోఅధ్యక్షుడు జయరామప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- అమరాపురంలోని వీరశైవ కల్యాణమంటపంలో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్, సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. గురువారం సాయంకాలం స్థానిక వీరశైవ కల్యాణ మంటపంలో చేసిన ఏర్పాట్లను ఆయన రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి వాగేష్‌తో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రవిశేఖర్‌రెడ్డి, వాగేష్, జిల్లా కార్యదర్శులు శివకుమార్, రంగేగౌడ, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, స్థానిక నాయకులు జయప్రకాష్, వెంకటరమణప్ప, యంజేరప్ప, నాగన్న, రసూల్‌భాష, ఈరలింగప్ప, అన్వర్ భాష, సిద్దేశ్వర, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



గుడిబండలో ఇంటి వద్ద నియోజకవర్గ పరిశీలకుడిని సన్మానిస్తున్న ఈరలక్కప్ప

సంక్షేమ పథకాలే విజయ సోపానాలు



మీడియాతో మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: వైఎస్సార్‌సీపీకి సంక్షేమ పథకాలే విజయ సోపానాలని మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీకి అభ్యర్థులు కరువయ్యారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా ఓటమి తప్పదన్నారు. వైఎస్ జగన్ సింగిల్‌గా ఎన్నికల్లో పోటీ చేసి భారీ విజయాన్ని అందుకోబోతున్నారన్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ పిలుపుతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎంతో ఉత్సాహంతో పార్టీని గెలిపించడానికి సిద్ధ0ంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. మడకశిరలో కూడా ఘన విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్దన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గుడిబండ: మండలంలోని మందలపల్లి-2 గ్రామ సచివాలయ ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ నాగరాజు నాయక్ గురువారం తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల అనుభవాలు స్ఫూర్తిదాయకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పావగడ: విశ్రాంత ఉద్యోగుల జ్ఞానం, అనుభవాలు యువతకు స్ఫూర్తిదాయకం కావాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆకాంక్షించారు. స్థానిక సాయిరాం మందిరంలో గురువారం నిర్వహించిన తాలూకా విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుభవజ్ఞులైన విశ్రాంత ఉద్యోగులు సమాజం మార్పునకు సామాజిక సేలందించాలన్నారు. నివృత్త ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఎమ్మెల్యే నిధుల్లో అందిస్తానన్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మైలప్ప, ఉపాధ్యక్షుడు రాజగోపాలనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకుడు వేణురెడ్డి, కౌన్సిలర్ చిన్నమ్మ

హిందూపురం: పట్టణంలోని పరిగి బస్టాండ్ వద్ద నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, కౌన్సిలర్ చిన్నమ్మ ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేశారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, చాంద్ బాషా, తౌసిఫ్, ముజీబ్, రామాంజప్ప, వేణు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

స్వామి జపానందకు అరుదైన ప్రశస్తి



ప్రశస్తిని అందుకున్న జపానంద స్వామి

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద భగవాన్ మహావీర శాంతి రాష్ట్రీయ ప్రశస్తిని అందుకున్నారు. బెంగుళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా ప్రశస్తి ని ఆయన అందుకున్నారు. తాలూకా వ్యాప్తంగా 35 సంవత్సరాలుగా స్వామి జపానంద అందిస్తున్న ఆధ్యాత్మిక, ఆరోగ్య, సామాజిక సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భగవాన్ మహావీర శాంతి రాష్ట్రీయ ప్రశస్తిని అందించారు. స్వామిజీకి అవార్డు పట్ల ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, డాక్టర్ జీ వెంకట్రామయ్య తదితరులు హర్షం ప్రకటించారు.

ఘనంగా మడివాళ మాచిదేవ జయంతి



మాచిదేవ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక తాలూకా కార్యాలయంలో రజకుల ఆరాధ్య దైవం మడివాళ మాచిదేవ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు మాచిదేవ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సద్గురు మడివాళ మాచి దేవ తన వచన సాహిత్యంతో సమాజంలో పెను మార్పులు తీసుకు వచ్చిన విప్లవ కారుడన్నారు. కార్యక్రమంలో కసబ ఆర్ఐ రాజగోపాల్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

పావగడ: తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగేనహళ్లిలో విద్యుత్ షాక్ కు గురై ఓ ఆవు మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. బాధిత రైతు లింగమూర్తి తెలిపిన వివరాల మేరకు విద్యుత్ స్తంభం నుంచి తెగి కిందకు పడిన విద్యుత్ తీగ ఆవుకు తగలడంతో షాక్ కు గురై మృతి చెందిందన్నాడు. విషయం బెస్కాం అధికారులకు తెలిపినా చాలా సేపటి వరకు సంఘటనా స్థలానికి రాలేదని ఆరోపించాడు. రూ.60 వేలు విలువ చేసే ఆవు చనిపోవడంతో బాధిత రైతు ఆవేదన చెందాడు. స్థానిక వైద్యాధికారి హొసకేరప్ప సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విద్యార్థులకు క్రీడలూ అవసరమే

- సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



పెనుకొండలో షటిల్ క్రీడాకారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ కళాశాల సమీపంలోని ఇండోర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలను సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానవ సమాజంలో ఎంతో ప్రధానమైనవన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నవయసు నుంచే క్రీడలు ఆడడం వల్ల ఆరోగ్యంగా దేహదారుఢ్యంతోపాటు, చురుకుదనంతో ఉంటారన్నారు. విద్యతో పాటు క్రీడల ఆవస్యకతను గుర్తించాలన్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రీడాపోటీల్లో విద్యార్థులు, ఇతర క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని, ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయికి ఎదిగి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు.

వైఎస్సార్ బీమా మంజూరు



వైఎస్సార్ బీమా మంజూరు పత్రం అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి ఫరూక్

హిందూపురం: పట్టణంలోని రహమత్‌పురం 16వ వార్డుకు చెందిన జబీవుల్లా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా మృతుడి కుటుంబానికి రూ.90 వేలు మంజూరయ్యాయి. గురువారం 16వ వార్డు ఇన్‌చార్జి ఫరూక్ బీమా ప్రొసీడింగ్ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇంతకుముందు వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద ప్రభుత్వం రూ.10 వేలు అందసిందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి పవన్, వాలంటీర్ షబానా తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల విడుదల



క్యాలెండర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

హిందూపురం: పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు జుబేర్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. అలాగే రానున్న ఎన్నికలకు సంబంధించి తయారు చేయించిన 'సిద్ధం' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న అనేక సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల హృదయాలు గెలిచారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మారోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు చైతన్య గంగిరెడ్డి, మనోజ్, శ్రీరాములు, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

మడకశిరరూరల్/అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వక్కలిక కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, మండల ఎస్సీ సెల్ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి తెలిపారు. మండల విద్యా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీ చోళరాజు జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా గురువారం గౌడనహళ్లి ఉన్నత పాఠశాలలో సీఆర్‌పీని ఘనంగా సన్మానించారు. అంతకుముందు వారు మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే అమరాపురం మండలంలోని వలస స్కూల్ కాంప్లెక్స్‌లో సీఆర్పీగా విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ అవార్డు అందుకున్న ఓబలరాయను గురువారం ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానం చేశారు. ఎంఈఓలు రాఘవయ్య, కటరమణనాక్,హెచ్‌ఎం.శ్రీనివాసమూర్తి, సహచర సీఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



మృతునికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: శెట్టిపల్లి గ్రామానికి చెందిన తలారి సురేష్ (30) అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మంత్రి, నియోజకవర్గం సమన్వయ కర్త ఉషా శ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి, గ్రామాన్ని సందర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, వైశాలి జయశంకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, తిరుపాల్ నాయక్, ఆదిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట సమీపంలో 320 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన రమేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్నాడు. పోలీసు సిబ్బందిని చూసి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి బుక్కపట్నం వెళ్తూ కొండంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిరప్ప(30) కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: మోదీ వైఫల్యాలపై చార్జీషీట్ ప్రకటిద్దాం అంటూ కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీపీఐ నాయకులు వినోద్, శివప్ప, గోవిందరెడ్డి, బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, మారుతీరెడ్డి, చలపతి, గోవింద్, రామంజప్ప, లక్ష్మీనారాయణ, మురళి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. మడకశిరలో ఈ సారి కూడా వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలోనే పేద ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు, ఎంపీపీలు కవిత, రాధమ్మ, ఈరన్న, మండల కన్వీనర్లు రామిరెడ్డి, త్రిలోక్‌నాథ్, సింగల్ విండో అధ్యక్షులు చిక్కన్న, మోతిరామ్, చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, విక్రమ్, నాగేంద్ర యాదవ్, నాగేంద్ర, శివకుమార్, డైరెక్టర్లు, కౌన్సిలర్లు,సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక

మడకశిరరూరల్: మండలంలోని వైబీహళ్లి పంచాయతీ కోడిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త సిద్ధేశ్వరప్ప గురువారం మడకశిరలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి: మండలోలని నాగినాయని చెరువు, తుంగోడు, వెలిదడకల పంచాయతీలో మంత్రి ఉషాశ్రీ చరణ్ గురువారం పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు బుసయ్యగారిపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట రత్నంలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేటి పరీక్షలకు హాజరుకండి

పెనుకొండ: గతేడాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు ఈ నెల 2 నుంచి నైతిక విలువలు, 3న జరగనున్న పర్యావరణ విద్య పరీక్షలకు తప్పక హాజరు కావాలని ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాలలో చోరీ

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి మోటారు, కేబుల్ చోరికి గురైనట్లు హెచ్‌ఎం. హనుమంత రాయుడు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి పాఠశాలలోకి దుండుగులు ప్రవేశించి, దాదాపు రూ.30 వేలు విలువ చేసే మోటార్, కేబుల్ ఎత్తుకెళ్లారన్నారు.

పింఛన్ల పంపిణీలో 'పురం' టాప్

హిందూపురం: పింఛన్ల పంపిణీలో శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 13,864 పింఛన్లు ఉండగా.. గురువారం మొదటి రోజు సాయంత్రానికి 11,039 మందికి సొమ్ము అందజేశారు. 79.65 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో మడకశిర 79 శాతం, కదిరి మున్సిపాలిటీ 78.89 శాతం, తలపుల 75.54 శాతం, నల్లమాడ 71.13 శాతం, హిందూపురం మండలం 67.54 శాతం, చిలమత్తూరులో 68.86 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. అత్యల్పంగా లేపాక్షిలో 15.42 శాతం పింఛన్లు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్రా'లో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రం చూపుతున్న విద్యార్థినులు

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. మడకశిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి వాలీ బాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి రెండో బహుమతి పొందినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. గురువారం విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ రోజా, పీఈటీ భాగ్యమ్మ, ఉపాధ్యాయినులు, విద్యార్థులు అభినందించారు.

న్యాయం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పెనుకొండ: పట్టణంలోని తోటగేరి ప్రాంతంలో ఉన్న స్థలం విషయంలో అధికారులు తమకు న్యాయం చేయాలని స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. గురువారం స్థానిక వాసవీ కళ్యాణ మంటపంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. నాయకులు యాడికి నాగరాజు, నామారాధాస్వామి, గుండా శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనంబర్ 393 5ఏ, 1ఏలో 10 సెంట్ల స్థలం వెచ్చం చలమయ్యకు చెందిందన్నారు. ఈ స్థలాన్ని వారి కుమారులు వెచ్చం రామయ్య, వెచ్చం కృష్ణయ్య, వెంకటాచలపతి స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘానికి దానం చేశారన్నారు. ప్రస్తుతం ఈస్థలంలో ఆర్యవైశ్య యువజన సంఘం తరఫున మున్సిపల్ అనుమతి తీసుకొని రూములు కట్టడానికి ప్రయత్నం చేస్తుండగా కొందరు వ్యక్తులు ఈ స్థలం గ్రామ కంఠమని అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు దేవతా వెంకటేష్, యాడికి సతీష్, గుండా రవి పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

గుడిబండ: మండలంలోని ఫళారం క్రాస్ వద్ద గురువారం సాయంత్రం ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనాదారులకు జరిమానా విధించారు. మద్యం, గుట్కా ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

డీఎస్సీ పోస్టుల భర్తీపై హర్షం

హిందూపురం టౌన్: డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 6100 పోస్టులతో డీఎస్సీ ప్రతిపాదించిందని, అయితే మరిన్ని పోస్టులను జత చేసి మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. ముఖ్యంగా డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ నాటికి జూన్ వరకూ రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి పోస్టులు సంఖ్య పెంచాలని కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం

పెనుకొండ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో వారం రోజుల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరం ద్వారా గ్రామంలోని రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మట్టివేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ పీఓ శంకర్‌నాయక్ తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి

రొళ్ల: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. గురువారం మండలంలోని బీజీ హళ్లి, రొళ్ల జెడ్పీహెచ్ఎస్, హెచ్‌ఎం పల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. రొళ్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. వచ్చే మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణ సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నాడు-నేడు రెండో దశ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.